17212 దాటితే రికవరీ



సమీక్ష : ఐరోపా మార్కెట్లలో ఊగిసలాట, దేశీయంగా నిరుత్సాహకర కార్పొరేట్ ఫలితాలు.. వీటికి తోడు ఎఫ్ఐఐల విక్రయాలు సూచీలను గతవారం నష్టాల్లోకి తీసుకెళ్లాయి. వారం ఆరంభంలో కొంత సానుకూలంగా స్పందించిన మార్కెట్లు వారాంతానికి లాభాల స్వీకరణకు గురయ్యాయి. వారం మధ్యలో రికవరీ కనిపించినా.. కార్పొరేట్ ఫలితాలు రాణించకపోవడం, ఆహార ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి పెరగడంతో ఆ లాభాలు మిగల్లేదు. రిజర్వు బ్యాంకు పరపతి విధాన సమీక్ష, యూరోపియన్ యూనియన్ సదస్సులు ముందుండడంతో మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించారు. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 297 పాయింట్లు నష్టపోయి 16786 వద్ద స్థిరపడింది.

ఎఫ్ఐఐల పనితీరు దేశీయ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐల నిధుల తరలింపు కొనసాగింది. వీరు గతవారం రూ.348.50 కోట్ల విక్రయాలు చేశారు. మ్యూచువల్ ఫండ్లు సైతం రూ.518.80 కోట్ల అమ్మకాలు చేయడం విశేషం.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:3గా నమోదవడం.. మార్కెట్లో బేరిష్ సెంటిమెంటును సూచిస్తోంది.

భవిష్యత్ అంచనా గత 11 వారాలుగా సెన్సెక్స్ 15700-17300 మధ్య కదలాడింది. ఈ శ్రేణిని ఛేదిస్తే మార్కెట్లో ర్యాలీని చూడొచ్చు. యూరోపియన్ యూనియన్ సదస్సు జరగనున్న నేపథ్యంలో మార్కెట్లు ఈ పరిణామాన్ని సునిశితంగా గమనించొచ్చు. మరింత దిశ కోసం దేశీయంగా కార్పొరేట్ ఫలితాలను గమనించాల్సి ఉంటుంది.

ప్రభావిత అంశాలు రిజర్వు బ్యాంకు సమీక్షలో పావు శాతం మేర కీలక రేట్లు పెరిగే అవకాశముందన్న అంచనాలున్నాయి. మరింత రేట్లు పెరిగే అవకాశాలను ఆర్బీఐ సూచిస్తే సెంటిమెంటు దెబ్బతినవచ్చు. అక్టోబరు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు మంగళవారం ముగియనున్న నేపథ్యంలో నేడు, రేపు అధిక ఊగిసలాట ఉండొచ్చు. రూపాయి మారక విలువ 50 స్థాయిని దాటింది. ఇదే ధోరణి కొనసాగితే దిగుమతి ఆధారిత రంగాలపై ఒత్తిడి పడుతుంది. ఎగుమతి ఆధారిత రంగాలు మాత్రం రాణించొచ్చు.

తక్షణ నిరోధ స్థాయిలు: 17212, 17482, 17665; **తక్షణ మద్దతు స్థాయిలు:** 16854, 16756, 16608

17212 స్థాయిని అధిగమిస్తేనే మార్కెట్లో స్వల్పకాల రికవరీని అంచనా వేయొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్‌మనీ